ఉత్తిష్ఠ!

ఒక నవోదయం కావాలి
ఆ ఋభోదయం రావాలి
స్వార్థం, కపటం
చీమూ, రక్తంలా ప్రవహించే మన హృదయాలలో
ప్రేమ, త్యాగం నింపగల
ఒక మహోద్యమం రావాలి, ఆ ఘనౌషధం కావాలి

యుగయుగాల విభవమంతా
దొరికినంతా కొల్లగొట్టి, నాగరికమని మురిసిపోయిన
దోపిడి దొంగలు, సీమ దొరలను-
సత్యాహింసలే ఆయుధాలుగా,
ఆత్మార్పణమే మేటి బాకుగా,
లజ్జలో ముంచి-చిత్తుని జేసిన,
స్వతంత్ర భారత కల పండించిన
నాటి వీరుల దేశభక్తి మనకు కావాలి,
ఆ ఉద్యమ స్ఫూర్తి మనలో రావాలి

ఎన్ని జీవితాలు సమిధలైతేనో గదా,
ఆ స్వతంత్ర యాగం సఫలీకృతమైనది.
వరందించిన స్వేచ్ఛా భారతిలో
మరెందుకింత బాధ్యతా రాహిత్యం?

అడ్డు, అదుపూ లేకుండా పెరిగే జనాభా,
వారి చదువు మాట దేవుడెరుగు, వారి కడుపే నింపలేని మన దీనత్వం,
ఈ జనజీవన పోరాటంలో ఎప్పుడూ ఓడిపోయే ప్రకృతి మాత,
ఎటు చూసినా కాసుకి మోహం,
మోసం, వేషం, దౌర్బల్యం,
ఇంత ఆపదలో ఉన్నా,
కులగోత్రాలతో కుమ్ములాడే మన నీచత్వం!
ఈ మూర్ఖత్వానికి అంతం లేదా?
ఈ జాతిలో జవమే మిగిలి లేదా?

దేశమంటే మట్టి కాదు, మరెవరో‌ కాదు,
దేశమంటే మనమందరమే! అందుకే,

యాభై సంవత్సరాల కుంభకర్ణుని నిద్ర వదిలించే రామ బాణంలా ఉద్భోషిద్దాం -
దశాబ్దాలుగా మూసుకుపోయిన మన హృదయాంతరాలలోకి
ఝంఝామారుతంలా దేశం పట్ల భక్తి శ్రద్ధలు ప్రవహించాలని!
మన తరాలకి త్యాగపు మూల్యం తెలియాలని,
మన ఆత్మగౌరవం నిలవాలని!
బాధార్తుల అశ్రుధారలు తుడవగలిగే
ఆ నవోదయం కావాలని,
ఆ శుభోదయం రావాలని,
ఆ జ్ఞానోదయం కావాలని,
ఆ జ్ఞానోదయం కావాలని!

–భావన, 1997.